# "ఆయన బయలుదేరగా" (1)

## చదువుటకు నియమించినవి #31

VII. ప్రభువు పరిచర్యలో చివరి వారం (కొనసాగింది).
- E. మంగళవారం: "ప్రశ్నల మహా దినం" (కొనసాగింది).
  5. విధవరాలి కానుక (మార్కు 12:41-44; లూకా 21:1-4).
  6. జనసమూహములతో చర్చ.
     - ఎ. అన్యజనులు ప్రభువును చూడగోరారు (యోహాను 12:20-22).
     - బి. యేసు పొందబోవు మరణం - యూదులు, అన్యజనులు-అందరి కొరకు (యోహాను 12:23-36).
     - సి. యేసు యూదులచే నిరాకరింపబడ్డారు (యోహాను 12:37-50).
  7. యెరూషలేము నాశనమును గూర్చియు రెండవ రాకడను గూర్చియు అపొస్తలులతో చర్చ.
     - ఎ. వ్యాఖ్యానము, ప్రశ్నలు (మత్తయి 24:1-3; మార్కు 13:1-4; లూకా 21:5-7).
     - బి. యెరూషలేము నాశనమును గూర్చిన ఉపదేశము.
       1. యెరూషలేము నాశనానికి సంబంధంలేని సంఘటనలు (మత్తయి 24:4-14; మార్కు 13:5-15; లూకా 21:8-19).

### పరిచయం

చివరిగా మంగళవారం ముగియబోతుంది. ప్రభువుకును ఆయన శత్రువులకును మధ్య జరుగుతున్న చిన్న పోరాటాలు అంతమయ్యాయి. దేవాలయాన్ని ఆయన శాశ్వతంగా విడిచి పెట్టే సమయం ఆసన్నమయ్యింది. ఈ సమయంలో, "విధవరాలి కాసు," గ్రీకు దేశస్థులు ప్రభువును వెదకడం, యెరూషలేము దేవాలయం నాశనాన్ని గూర్చి ఉలికిపడేలా చేసిన ప్రభువు యొక్క ప్రకటన అనే వాటిని చదువుదాం.[1]

### దేవాలయములో తనిఖీ

### (మార్కు 12:41-44; లూకా 21:1-4)

వాగ్యుద్ధమైన పిమ్మట, క్రీస్తు స్త్రీల ప్రాంగణంలోనికి వెళ్లారు.[2] అక్కడ జనులు కానుకల

పెట్టెలలో తమ కానుకలు వేయడం ఆయన కనిపెట్టారు. అందులో రెండు కాసులు వేసిన ఒక విధవరాలి అర్పణతో ఆయన ముగ్దులయ్యారు. "ఆమె తన జీవనమంతా అర్పించింది." ఆయన చలించి తన శిష్యుల యెదుట ఆమెను మెచ్చుకొన్నారు (మార్కు 12:42-44; లూకా 21:2-4).[3]

మనస్సు కరిగించెడి ఈ దృశ్యం ఎందుకు రికార్డు చేయబడింది? ప్రభువును లయపరచజూస్తున్న వారికినీ ఆమెకును గల తారతమ్యాన్ని చూపడానికి అయ్యుండవచ్చు. దేవునిపై ప్రేమచేత ఆమె దేవాలయానికి వచ్చింది. శాస్త్రులు పరిసయ్యులైతే కేవలం క్రీస్తు యేసుపై ద్వేషాన్ని బట్టియే అక్కడున్నారు. B. S. Dean యిలా కామెంట్ చేశాడు, "గొప్పగా తప్పుమోపిన [మత్తయి 23], వెనువెంటనే కలిగిన మనోహరమైన ఈ సంఘటన మిక్కిలి పెద్ద మంచు గడ్డ భుజాన ఊదారంగు నీటి ఊటలా ఉంది."[4]

## దేవాలయములో నిరాకరించబడుట (యోహాను 12:20-50)

### అన్యజనులు ఆయనను వెదకారు (20-36 వచనాలు)

కొన్ని రోజులకు ముందుగా, ''లోకము ఆయున వెంట పోయినదని'' పరిసయ్యులన్నారు. (యోహాను 12:19). తరువాత సంఘటన క్రీస్తు యొక్క సార్వత్రికమైన సంబంధాన్ని ఉదహరిస్తుంది. ప్రభువు దేవాలయములో ఉండగా, కొందరు గ్రీకు దేశస్థులు ఆయనను వెదకుతూ వచ్చారు.[5] తన శత్రువులైన యూదులు ఆయనను చంప వెదకుచుండగా అన్యజనులు ఆయనతో పొత్తు కోరి వచ్చారు.

ముఖాముఖిగా క్రీస్తు గ్రీకు దేశస్థులను కలిసికొన్న రికార్డు లేదు కాని సకల జనుల పట్ల ఆయనకున్న ప్రేమను ఎరిగినవారమై, వారాయనను కలిసికొన్నట్టు భావించుతాం. ఏదియెలాగున్నా మన కుతూహలాన్ని తీర్చడమనేది దైవప్రేరేపితులైన లేఖికుల ఉద్దేశం కాదని మరోసారి గుర్తించాలి. యోహానుగారు దాఖలు చేసిన ప్రసంగం కోరిక మేరకు అందించబడినదై ఉంది.[6] 32వ వచనంలో ఆయన బహు ధైర్యమైన ప్రతిపాదన చేశారు: "నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నా వద్దకు ఆకర్షించుకొందునని చెప్పెను." "అందరిని" అంటే యూదులను అన్యజనులను అని భావం.

ప్రసంగపు ముగింపులో, యేసు ఈ మాటలు చెప్పి వెళ్లి వారికి కనబడకుండ "దాగి యుండెను" (37ఎ). The KJV, NASB 1977 ఎడిషన్‌లో ఆయన "బయలుదేరి వెళ్లి" అన్నట్టుంది. ప్రభువు వారి బహిరంగ ఉపదేశం ముగింపులో ఉంది.

### యూదులచే నిరాకరింపబడ్డారు (37-50 వచనాలు)

యూదుల దేశంలో ప్రభువు పరిచర్య సంగ్రహముతో యోహాను క్రీస్తు వెడలి పోడాన్ని చిత్రిస్తున్నాడు. ఆయన అనేకమైన సూచకక్రియలు (అద్భుతములు) చేసినా వారు నమ్మకున్నారు (37 వ.). క్రీస్తును వారు నిరాకరించడంతో యెషయా 6:10; 53:1. వంటి ప్రవచనాలు నెరవేర్చబడినట్టు యోహాను నొక్కి చెప్పాడు. అప్పుడు అపొస్తలుడు ఈ ఆలోచన చెప్పి కామెంట్ చేశాడు:

> అయినను అధికారులలో కూడ అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి గాని, సమాజములో నుండి వెలివేయబడుదుమేమో యని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు. వారు దేవుని మెప్పుకంటే మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించిరి (యోహాను 12:42, 43).

ప్రభువైన యేసు అద్భుతములు చేసిన సంగతి యూదామత నాయకులకు తెలుసు (యోహాను 11:47), అయినా ఆ జ్ఞానం వారిమీద బహిరంగమైన ఏ ప్రభావాన్ని కనుపరచినట్టులేదు. అది అలా ఎందుకు జరిగిందో యోహాను యిక్కడ బయలుపరచాడు. ఇంతకు అద్భుతాలు వారిని తాకకుండ పోలేదు.[7] అయితే వారు తమ విశ్వాసాన్ని దాచుకొంటున్నారు. "సమాజములోనుండి వెలివేయబడ"డాన్ని తప్పించుకోవాలను కొంటున్నారు. లేకుంటే వారు తమ మతపరమైన, ఆర్థిక, సాంఘీక, జాతీయ, రాజకీయ జీవితం నుండి తుంచివేయబడతారు.[8]

ఒప్పుకోలు యొక్క ప్రాముఖ్యతను యోహాను 12:42, నొక్కి చెప్పుతుంది. మన హృదయములో ఉన్న విశ్వాసము మన పెదవుల మీద కూడా ఉండాలి (రోమా. 10:9, 10). మనం ఆయనను ఒప్పుకొనడానికి నిరాకరించినట్టయితే, ఆయన మనలను అంగీకరించరు (మత్తయి 10:32, 33).[9]

ఈ అధికారులు, విషాధకరంగా, దేవుడు ఏమనుకుంటాడో ఆలోచించే దానికంటె, మనుష్యులు ఏమనుకుంటారో అని ఆలోచింపసాగారు. "వారు దేవుని మెప్పు కంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించారు." దేవుడు ఏమనుకుంటాడో అనే దానికంటె మనుష్యులు ఏమనుకుంటారో అనే ఒత్తిడిలో మనమందరం ఉండినవారమే. అదేంటో మనకు తెలుసు. అయితే ప్రాధాన్యతలు రగులుతున్న ప్రశ్నయై యుంది. పౌలు యిలా రాశాడు, "నేను మనుష్యుల దయను సంపాదించుకొన జూచుచున్నానా. దేవుని దయను సంపాదించుకొన జూచుచున్నానా? ... నేనిప్పటికిని మనుష్యులను సంతోష పెట్టువాడనైతే క్రీస్తు దాసుడను కాకయేపోవుదును" (గలతీ. 1:10).

యూదులు ప్రభువుని నిరాకరించిన విషయాన్ని చర్చించిన తరువాత, ప్రభువునందు విశ్వాసముంచడంలోగల ప్రాముఖ్యతను, అలా చేయకపోవడం వలన వచ్చే పర్యవసానాన్ని గూర్చి తెలిపిన ప్రతిపాదనను అతడు కోట్ చేశాడు (యోహాను 12:44–50). అయితే ప్రభువు ఈ మాటలు ఎప్పుడు పలికారో మనకు తెలియదు.[10] వాటిలో యోహాను రచనయందు పరిచయం చేయబడిన పలు అంశాలను ఆయన కొనసాగించారు:

- యోహాను 5లో[11] చెప్పినట్టే, యిక్కడ 44, 45, 49, 50 వచనాలలో తనకును తన తండ్రికిని మధ్యగల సన్నిహితమైన సంబంధాన్ని గూర్చి ఆయన నొక్కి చెప్పారు. ఈ విధంగా తన్ను నిరాకరించినవారు దేవుని సయితం నిరాకరించిన దోషులైయుంటారని ఆయన నొక్కి చెప్పారు.
- 46వ వచనంలో "లోకమునకు వెలుగు" అనే చర్చను ఆయన ఎత్తుకొన్నారు. ఇది యోహాను 8:12లో పరిచయం చేయబడి, 9లో వివరించబడి, యోహాను 12:35, 36లో సూచించబడింది.[12]

47, 48 వచనాలలో ప్రభువు చేసిన ప్రతిపాదన యందు – ఆయన బోధను అంగీకరించకుండ ఆయనను అంగీకరించ (విశ్వాసముంచ) వల్లపడదనే సత్యాన్ని శక్తివంతంగా సూచిస్తుంది.

> ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండినయెడల నేనతనికి తీర్పు తీర్చను; నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు గాని లోకమును రక్షించుటకే వచ్చితిని.[13] నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును.[14]

## దేవాలయము నుండి వెడలి పోవుట

## (మత్తయి 24:1-14; మార్కు 13:1-15; లూకా 21:5-19).

### ఉలికి పడేలా చేసిన కామెంట్ (మత్తయి 24:1–3; మార్కు 13:1–4; లూకా 21:5–7).

"పైకెత్తబడిన యెడల" అనే చర్చను ముగించిన తరువాత ఆయన "బయలుదేరి" (యోహాను 12:36) "దేవాలయము నుండి వెడలిపోయారు" (మార్కు 13:1ఎ; మత్తయి 24:1ఎ). క్రీస్తు దేవాలయాన్ని విడిచి వెళ్లడం గణ్యమైనది. దేవుని మహిమ (యైన క్రీస్తు[15]) వెడలిపోయి మరెన్నడు తిరిగి రాదు.[16] దేవాలయం నాశనం చేయబడడానికి పలు దశాబ్దాలు గతించవలసియున్నా, దాని గతి ముద్రించబడింది (మత్తయి 23:37, 38 చూడు).

దేవాలయపు కాంప్లెక్సు నుండి వెలుపలికి వెళ్లగా, ఆయన శిష్యులు–వేరు ప్రాంతం నుండి వచ్చిన సందర్శకులుగా – దాని చుట్టునున్న కట్టడాల సౌందర్యాన్ని చూడడానికి ఆగి తిలకించినట్టున్నారు. అప్పుడు ఆయన శిష్యులలో ఒకడు – "బోధకుడా, యీ రాళ్లేలాటివో యీ కట్టడములు ఏలాటివో చూడుమని ఆయనతో అనెను" (మార్కు 13:1)."కొందరు – ఇది అందమైన రాళ్లతోను, అర్పితములతోను శృంగారింప బడియున్నదని"[17] దేవాలయాన్ని గూర్చి మాట్లాడుకొంటున్నారు (లూకా 21:5).

దేవాలయపు కట్టడాలు బహు ఘనమైనవి, వాటియందు యూదులు సగర్వంగా ఉంటారు. అది ఏథెన్సులోని ఆక్రోపోలిస్ కంటె రెండంతలు పరిమాణం గలది. అది తెల్ల చలువరాయి మరియు సున్నపు రాయితో చేయబడింది. దూరం నుండి చూస్తే మంచుతో కప్పబడిన పర్వతంలా ఉంటుంది. ఈ దేవాలయాన్ని మహా హేరోదు క్రీ.పూ. 20లో కట్టనారంభించాడు. ఈ విషయం చర్చించబడుచున్న సమయానికి అది యింకను కట్ట బడుతూనే ఉంది.[18] ఒక యాత్రికుడు యెరూషలేమునకు వచ్చిన ప్రతిసారి ఏదో కొంచెం చేర్చబడుతున్నట్టు కన్పిస్తుంది కాబోలు. "అర్పణములతో" దేవాలయం అలంకరింపబడినట్టు జోసీఫస్ అన్నాడు. అగ్రిప్పచే బహుకరించబడిన కిరీటాలు, డాళ్లు, బంగారు గొలుసులు వగైరాలున్నాయి. బంగారు ద్రాక్షవల్లి ద్రాక్షపండ్ల గుత్తులతో హేరోదు

బహుకరించాడు.[19] తాము చూచిన వాటివిషయంలో శిష్యులు ఇంప్రెస్ చేయబడ్డారంటే మనం ఆశ్చర్యపడనవసరం లేదు.

ఏదియేమైనా, వారి కుతూహలం యేసు జవాబుతో తాకబడింది: "ఆయన ఈ కట్టడములు మీరు చూచుచున్నారే, వాటిలో రాతి మీద రాయి యుండకుండ అవి పడద్రోయబడు దినములు వచ్చుచున్నవని చెప్పెను" (లూకా 21:6). యెరూషలేము, దేవాలయ నాశనమును గూర్చి క్రీస్తు యింతకు ముందుగానే చెప్పారు (మత్తయి 22:7; 23:38; లూకా 13:35[20]), అయితే అవి దాచబడిన రూపములో సూచించబడ్డాయి. ఈ సందర్భంలో ఆయన మాటలు అర్థం చేసుకోడం కష్టం.

వీటిలో, "రాతి మీద రాయి యొకటియైన ఇక్కడ నిలిచియుండ కుండ పడద్రోయ బడునని" ప్రభువు తెలిపారు ( మార్కు 13:2బి).[21] "జోసీఫస్ ప్రకారము, కొన్ని రాళ్లయితే దాదాపు 70 అడుగుల పొడవు, 12 అడుగుల ఎత్తు, 18 అడుగులు వెడల్పున్నాయి."[22] "రాతిమీద రాయి యొకటియు నిలువదా? అదెలా సాధ్యం?" అని ఆ రాళ్లను తిలకించిన అపొస్తలులు అనుకొని యుండవచ్చు. ఇశ్రాయేలు మతానికి, మహిమకు దేవాలయమే కేంద్రమైయుంది. దాని నాశనం ఊహాతీతమయ్యింది.

ప్రభువూ ఆయన శిష్యులూ దేవాలయాన్ని విడిచి, కెద్రోను వాగు దాటి దేవాలయపు తూర్పు దిశనున్న ఒలీవల కొండ అనబడే ఎత్తయిన స్థలాన్ని ఎక్కారు-వారు రాత్రుల్లో కాలం గడిపే చోటు అదేనేమో (లూకా 21:37). వారు ఆ కొండ చరియమీద కూర్చుండి (మత్తయి 24:3ఎ చూడు), దేవాలయాన్నీ పట్టణాన్నీ వారు తిలకించుతుండగా, "క్రుంగే సూర్యకిరణాల నీడలతో పొడవుగా అల్లిక చేయబడినట్టు వారి ఎదుట అవి బహు తేటగా ఉన్నాయి."[23] దేవాలయపు కట్టడాలను వారు చూస్తూ ఉండగా (మార్కు 13:3ఎ), శిష్యుల హృదయాలలో రగులుతున్న ప్రశ్నలు బయటికి పొక్కాయి.[24] "ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడను ఈ యుగసమాప్తికి సూచనలేవి?" మాతో చెప్పుమని శిష్యులు ఆయననడిగారు (మత్తయి 24:3; మార్కు 13:4; లూకా 21:7).

ఆయన శిష్యులు ఒకదాన్ని గూర్చి - అంటే దేవాలయం నాశనాన్ని గూర్చియే అడుగుతున్నట్టు తలంచియుండ వచ్చు గాని - వాస్తవానికి వారు పలు విషయాలను అడిగారు. ప్రత్యేకించి వారు, ఆయన "రాకడను" గూర్చియు ఈ "యుగ సమాప్తిని" గూర్చియు అడిగారు.[25] "రాకడ" అనే తర్జుమాకు గ్రీకు పదం parousia. సువార్త రచనలలో ఈ పదం మత్తయి 24:(3, 27, 37, 39 వచనాల్లోనే) కనిపిస్తుంది.[26] *Parousia* "రాజు వచ్చేదానికి ఉపయోగించే సాంకేతిక పదం."[27] శిష్యులు ఈ పదాన్ని ఉపయోగించినప్పుడు, ప్రభువు తన రాజ్యాన్ని స్థాపించడానికి అనేది వారి మనస్సులో ఉండవచ్చు. వారు దాన్ని భౌతికమైన రాజ్యమని అపార్థం చేసికొన్నారనుకో.[28] ఆ సందర్భంలో, "యుగ సమాప్తి" అంటే (వారి మనస్సుల్లో) ప్రస్తుతమున్న రాజకీయ నియమం (అంటే, ద్వేషించబడే రోమీయుల పాలన అంతం అని భావం). (వారు ఊహించిన) మెస్సీయ రాజ్య ప్రారంభం తప్ప మరేదియు దేవాలయాన్ని నాశనం చేయగల ఆపద (విపత్తు) కలిగించలేదని వారి నమ్మికయైయుండవచ్చు. ప్రభువైన యేసు జవాబును మనం చదువుతుండగా, ఆయన బదులు దేవాలయపు నాశనాన్ని చుట్టివచ్చేదానికంటె

ఎక్కువగా ఉన్నట్టు మనం గమనించగలం.

**తీవ్రమైన వివాదము**

మత్తయి 24:4-25:46 (మార్కు 13:5-37; లూకా 21:8-36లను చూడు)లో, తన శిష్యుల ప్రశ్నలకు క్రీస్తు వారి జవాబు - దాఖలు చేయబడిన చర్చలలో బహు దీర్ఘమైనదియు, తీవ్రమైన వివాదమును చోటుచేసి కొన్నదియునైయుంది. వెయ్యేండ్ల పరిపాలనా వాదాలు మత్తయి 24ను రెండవ రాకడకు "సూచనలుగా"[29] ఉపయోగించు కొన్నారు.[30] ప్రస్తుతపు కరువులు, యుద్ధాలు రాకడకు "సూచనల"ని చెప్పనారంభించారు. ఆయన ఎప్పుడు వచ్చేది ఎవరికి తెలియదని ప్రభువు చెప్పినా వారు దాన్ని పట్టించుకున్న వారుకారు (మత్తయి 24:36).

సంబంధంగల లేఖన భాగాలతో, మనం మత్తయి 24ను పఠించేటప్పుడు, మనం ఏ విధానంలో దాన్ని సంధించినా, అది కష్టమైన లేఖన భాగమని అంగీకరిస్తాం. అందుకు ఒక కారణమేమంటే, "సాధారణమైన యూదుల అపోకలిప్టిక్ ఇమేజరీ"ని క్రీస్తు ఉపయోగించారు. [ప్రవచనపు అలంకార భాష][31] ప్రవచనపు సాహిత్యము తేటైన (తరచుగా వింతైన) గురుతులను సందేశాన్ని తెలపడానికి ఉపయోగిస్తుంది.[32] యూదులకు ఆ భాష బాగా తెలుసు. మనలో చాలా మందికి దీనితో పరిచయం లేకపోవడంవలన, దాని భావాన్ని గ్రహించడం మనకు కష్టం.

ఈ కష్టానికి మరో కారణమేమంటే, ఒక ప్రశ్నకు కాదు, పలు ప్రశ్నలకు ప్రభువు బదులిచ్చారు: దేవాలయం నాశనాన్ని గూర్చిన ప్రశ్నలకు, మరియు ఆయన రెండవ రాకడను గూర్చిన ప్రశ్నలకు. క్రీ.శ.70లో ఏమి జరుగుతుంది, యుగాంతమందు ఏమి జరుగుతుంది అనే ఆయన ప్రతిపాదనలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి. తరచుగా ఉపయోగించబడుతున్న పోలిక - రెండు పర్వత శిఖరాలు - చిన్నది దగ్గర, పెద్దది దూరంలో ఉన్నట్టు - వాటి బొమ్మలు మన దృష్టిలో ఏకంగా కలుప బడుతున్నాయి. యెరూషలేము నాశనానికి, రెండవ రాకడకు దగ్గర సంబంధాలున్నట్టు ఎక్కువ మంది బైబిలు పండితులు అంగీకరిస్తారు - ఆ రెండు సంఘటనలకు వేల సంవత్సరాల అంతరం ఉన్నా: మొదటిది (యెరూషలేము నాశనం) రెండవ దానికి (రెండవ రాకడకు) మాదిరి.

ఈ ఆలోచనలు కలసినట్టు కన్పించినా, మత్తయి 24లోని తొలి భాగం యెరూషలేము నాశనానికి సంబంధించిందిగాను రెండవ భాగము రెండవ రాకడను నొక్కిచెప్పుతుందని అనేకులు భావిస్తారు:

- ఈ అధ్యాయంలోని మొదటి భాగంలో 19, 20 వచనాలను గమనించు: "అయ్యో, ఆ దినములలో గర్భిణులకును పాలిచ్చువారికిని శ్రమ. అప్పుడు మహా శ్రమ కలుగును గనుక మీరు పారిపోవుట చలికాల మందైనను విశ్రాంతి దినమందైనను సంభవింపకుండవలెనని ప్రార్థించుడి." పిల్లలు కనడంతోగాని రోజులు వారాలతోగాని రెండవ రాకడకు సంబంధమేమైనా ఉంటుందా? లేదు, ఈలాటి పరిస్థితులు యెరూషలేము నాశనముతో సంబంధం

కలిగియుంటాయి.[33]

- రెండవ భాగంలో, 40, 41 వచనాల్లో, కొందరు తీసికొనిపోబడుదురు, కొందరు విడిచిపెట్టబడుదురు అనే ప్రతిపాదనలను గమనించు. ఈ వచనాలకు యెరూషలేము నాశనమునకు ఏ విధమైన సంబంధము లేకపోగా, అవి రెండవ రాకడతో సంబంధం కలిగియున్నాయి.[34]

మత్తయి 24:4-35 (యెరూషలేము నాశనాన్ని కేంద్రంగా చూపే దానికిని)కును, మత్తయి 24:36-41 (రెండవ రాకడను కేంద్రంగా చూపే దానికిని)కును చాల తారతమ్యాలను చూపించవచ్చు. చార్టు 1లో ఆలాటి కొన్ని సూచింపబడ్డాయి.[35]

మత్తయి 24 తొలి భాగంలో యెరూషలేము నాశనము, చివరి వచనాలు ప్రధానంగా రెండవ రాకడకు సంబంధించినవని కొందరు వ్యాఖ్యాన కర్తలు అంగీకరిస్తారు. అయినా, అవి ఒకదానితో మరొకటి అల్లుకున్నాయని వారు నొక్కి చెప్తారు. అందువలన, ఏ వచనం యెరూషలేము నాశనం, ఏ వచనం రెండవ రాకడో వారు తమకు యిష్టం వచ్చినట్టు నిర్ణయిస్తారు. మత్తయి 24ను ఈ విధంగా వివరించితే,[36] 34వ వచనం ఎదురు తగులుతుంది జాగ్రత్త: అక్కడ ప్రభువు యిలా అన్నారు: “ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.” ఉన్నదున్నట్టుగా ఈ వచనాన్ని తీసికొన్నామంటే, 4 నుండి 33వ వచనం వరకు చెప్పబడినవన్నియు అక్కడ జీవించిన వారి జీవిత కాలంలోనే నెరవేర్చబడాలని ఆయన తెలిపారు.[37] *(genea)* “తరము” అనే గ్రీకు మూలం నుండి వచ్చింది - ఒక ప్రత్యేకమైన కాలంలో జీవించే వారిని సూచిస్తుంది. మత్తయి 24:34లో ఆయన ప్రతిపాదన చేసినదానికి ముందు, తన శ్రోతలపైన భయంకరమైనవి వస్తాయని ఆయన సూచించారు (మత్తయి 23:36; మత్తయి 24:34తో పోల్చి చూడు).

మత్తయి 24:24-33 అంతటిలో లేక ఒక భాగాన్నో రెండవ రాకడకు సూచించే వారు 34వ వచనం దగ్గర తడబడతారు. “తరము” అనేది “వంశము” అని వారు నిర్భంధిస్తారు, అంటే “యూదుల జాతి” అని వారంటారు. వ్యాఖ్యానించే వారికి ఆ లేఖన భాగం యిబ్బంది కలిగించకుంటే ఆ నామవాచకానికి అలాటి భావం చెప్పడం సమంజసమే కాదని R. T. France అన్నాడు[38] Jack P. Lewis యిలా రాశాడు:

> ఈ అధ్యాయమంతటిని వ్యాఖ్యానించడానికి తరము (genea) యొక్క భావము కీలక పాత్ర వహిస్తుంది. జెరోమును అనుసరించిన స్కోఫీల్డ్, అది యూదా జాతి అని వాదించగా, క్రొత్తనిబంధనలో (లూకా 16:8) genea అంటే జాతి అనే అర్థం ఒకే ఒక చోట సాధ్యమౌతుంది. (జాతి) genos అనే దానికి genea (తరము) అనే దానికి మధ్య వ్యత్యాసముంది. genea అంటే చివరి తరమని కొందరు వాదించారు, అంటే, సూచనలు జరగడం ఆరంభించాయంటే, యివన్ని ఒక తరములోనే జరిగిపోతాయి (23:36తో పోల్చి చూడు). కాని మత్తయిలో వేరేచోట genea అంటే ఒక కాలములో జీవించే ప్రజలు, మరియు సాధారణంగా యేసు కాలంలో జీవించే ప్రజలని అర్థం (1:17; 11:16; 12:39; 41, 45; 23:36; మార్కు 8:38; లూకా 11:50, 51; 17:25), మరియు నిస్సందేహంగా యిక్కడ కూడా అదే అర్థం.[39]

దీని వెంటవచ్చే స్టడీలో,[40] క్రీస్తు ఆ మాటలు పలికినప్పుడు జీవించుతున్న తరములోనే 34వ వచనానికి ముందు సంఘటనలు జరుగుతాయని అర్థం.[41] ఈ విధానంలో ఎదురయ్యే కష్టాలు[42] లేఖనాల్లో ఎదురైనప్పుడు వివరించబడతాయి.

## గణనీయమైన ఆరంభం (మత్తయి 24:4–14; మార్కు 13:5–15; లూకా 21:8–19)

మత్తయి 24 దానికి సంబంధించిన మార్కు, లూకా లేఖన భాగాలను చదవడానికి మనం సిద్ధంగా ఉన్నాం. ఈ స్టడీ తరువాత పాఠంలో పూర్తియౌతుంది.

క్రీస్తు తన చర్చను "గురుతులులేకుండ"నే ఆరంభించారు. యూదులకు యెరూషలేము నాశనము ఎంత చంచలనాత్మకమైన సంఘటన అంటే – క్రీస్తు యొక్క ప్రవచనపు నెరవేర్పు కొరకు చూచేవారు ఏ చిన్న దానినైనా సూచనగా తీసికొని అది జరుగబోతుందని అంటారు. ఈ ఉదాహరణను ఆలోచించు: నా యిల్లు కూలిపోతుందని ఎవరైనా అంటే – అతన్ని నేను నమ్మినట్టయితే – ప్రతి తుఫాను నన్ను పిరికివానిగా చేస్తుంది. తన అనుచరులను తప్పు దారిలో నడిపించడానికి ప్రభువు యిష్టపడలేదు (మత్తయి 24:4; మార్కు 13:5; లూకా 21:8ఎ). గనుక, తప్పుగా నడిపింపబడే గురుతులను గూర్చి ఆయన మొదటిగా వారిని హెచ్చరించారు.

*అబద్ధపు క్రీస్తులు:* అబద్ధ మెస్సీయాలు వస్తారని ఆయన వారితో చెప్పారు (మత్తయి 24:5; మార్కు 13:6; లూకా 21:8బి; మత్తయి 24:24; మార్కు 13:22 లను కూడా ముందుగా చూడు). "వారి వెంట పోకుడి" అని ఆయన వారికి తెలిపారు (లూకా 21:8సి). అప్పుడప్పుడు, ఆ కాలంలో, మహా గొప్పవాడనని చెప్పుకొంటూ ఒకడు జనులను తనవైపు ఆకర్షించవచ్చు (అపొ. 5:34–39; 21:38లను చూడు).[43]

*యుద్ధములు యుద్ధ సమాచారములు:* యుద్ధాలు, యుద్ధాలను గూర్చిన పుకారులు శిష్యులను కలవరపెట్టకూడదు (మత్తయి 24:6ఎ; మార్కు 13:7ఎ; లూకా 21:9ఎ). "ఇవి జరుగవలసియున్నవి గాని [యెరూషలేము యొక్కయు దేవాలయము యొక్కయు] అంతము వెంటనే రాదు" అని ప్రభువు వివరించారు (మత్తయి 24:6బి మార్కు 13:7బి; లూకా 21:9బిలను చూడు). రోమా సామ్రాజ్యము శాంతియుతంగా ఉన్న కాలంలో ఈ మాటలను పలికారు; కాని చరిత్ర కారుల ప్రకారం, యుద్ధం ముంచుకురావడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

*ప్రకృతి వైపరీత్యాలు:* కరవులు, తెగుళ్లు, భూకంపములువంటి ప్రకృతి వైపరీత్యాలు అవి ఎప్పుడు ఉన్నట్టే జరుగుతాయని ప్రభువు సూచించారు (మత్తయి 24:7బి; మార్కు 13:8బి,; లూకా 21:11[44]). "ఇవన్నియు వేదనలకు ప్రారంభము" అని ఆయన అన్నారు (మత్తయి 24:8; మార్కు 13:8సి). "ప్రారంభము" అనే పదము "అంతము" అనేదానికి 6, 14 వచనాలలో తేడా ఉంది. అంటే, ఈ ప్రకృతి వైపరీత్యాలు "అంతమునకు సూచనలు" కావు.

*సంఘానికి సంబంధించిన దుఃఖ పరిస్థితి:* ప్రభువు శిష్యులు హింసింపబడే దాన్ని

గూర్చి ఆయన హెచ్చరించారు (మత్తయి 24:9; మార్కు 13:9ఎ, 13ఎ; లూకా 21:12ఎ, 16బి; 17).[45] అయినా ప్రభువు వారికి తోడైయుంటానని వాగ్దానం చేశారు (లూకా 21:18[46]). ఆ హింసను తనను గూర్చి సాక్ష్యమిచ్చే అవకాశంగా చూడవలసిందని ఆయన వారికి తెలియజేశారు (మార్కు 13:9బి, 11; లూకా 21:12బి, 13-15)[47] మరియొక సమస్య అబద్ధ ప్రవక్తలు (అబద్ధ బోధకులు) వారు అనేకులను మోసపుచ్చుతారు (మత్తయి 24:11; మత్తయి 24:24; మార్కు 13:22లను చూడు).[48] ఒకవైపు హింస మరోవైపు అబద్ధ బోధకులను బట్టి కొందరు క్రైస్తవులు పడిపోతారు, కొందరైతే సాటి క్రైస్తవులను, కుటుంబ సభ్యులైనా సయితం అప్పగించుతారు (మత్తయి 24:10, 12; మార్కు 13:12; లూకా 21:16ఎ). "అంతమువరకు సహించినవాడే రక్షింపబడును" అని క్రీస్తు చెప్పారు (మత్తయి 24:13; మార్కు 13:13బి; లూకా 21:19 చూడు). వారినీ – మనలనూ – నమ్మకంగా ఉండుమని ఆయన ఎంతగా కోరుతున్నారో!

*సువార్త వ్యాపకము:* "సూచనలు – కానివాటిని" ముగించుతూ, ప్రభువు యిలా అన్నారు; "మరియు ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోక మందంతటను ప్రకటింపబడును; అటు తరువాత అంతము వచ్చును" (మత్తయి 24:14; మార్కు 13:10 చూడు). కొన్ని వారాల తరువాత, ఆయన ఆరోహణమైన వెంటనే, ప్రభువు అపొస్తలుల కిచ్చిన "గ్రేట్ కమిషన్" అమలు చేయబడుతుంది. అంటే, "సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి," సమస్త జనులను శిష్యులనుగా చేయుడి" అనే ఆయన ఆదేశాలు అమలులోనికి వస్తాయి (మార్కు 16:15; మత్తయి 28:19). "భూదిగంతములవరకు" (అపొ. 1:8) ఆయన శిష్యులు సువార్తను ఎలా కొనిపోయారో అపొస్తలుల కార్యాలు వివరిస్తుంది. దీనికంతటికి సమయం కావాలి. అందువలన యెరూషలేము "దేవాలయపు నాశనం" అప్పటికి యింకా కొన్ని సంవత్సరాలు ముందుగా ఉన్నదని ప్రభువు సూచించారు. క్రీ.శ.63 ప్రాంతంలో (యెరూషలేము నాశనానికి ఏడు సంవత్సరాలు ముందుగా) "ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి" సువార్త ప్రకటింపబడిందని పౌలు రాశాడు (కొలస్సీ. 1:23[49]).

## ముగింపు

చిహ్నములు కానివాటిని, తప్పుగా నడిపించే సూచనలుగా పేర్కొన్న తరువాత, యెరూషలేము త్వరలో నాశనం చేయబడబోతుందని నిస్సందేహంగా శిష్యులు ఎలా తెలిసికోగలరో క్రీస్తు వారికి వివరించారు (మత్తయి 24:15; లూకా 21:20). మన తరువాత పాఠంలో మత్తయి 24ను యిక్కడ నుండి చదువుదాం.

ఇప్పుడు, కలతపెట్టే ఈ అధ్యాయాన్ని దేవుడు ఎందుకు భద్రం చేశాడో నీవు ఆశ్చర్యపోవచ్చు. మనం తరువాత పాఠానికి వెళ్లినప్పుడు, దీన్ని ఉంచడంలోని ఒక కారణాన్ని మనం చూడబోతాం. అదేమంటే, రోమాసైన్యం పట్టణాన్ని ముట్టడించినప్పుడు, యెరూషలేములోని క్రైస్తవులు భద్రపరచబడడానికి యిది యివ్వబడింది. ప్రభువు చెప్పిన మాటలమీద మనం ఆధారపడాలనే ఉద్దేశంతో యిది మనకు యివ్వబడియుండవచ్చు. "రాతిమీద రాయి ఒకటియు ఉండ కుండ" త్రోసి వేయబడుతుందనే ఆయన మాటలు

అక్షరార్థంగా నిజమైన సంగతిని తరువాత పాఠంలో చూద్దాం. ఏమి సంభవించినా నమ్మకంగా ఉండాలనే సత్యాన్ని నొక్కి చెప్పడం దీని ప్రధానమైన ఉద్దేశమై యుండవచ్చు. మనం ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి (మత్తయి 24:13, 42, 44).

## నోట్సు

"మత్తయి 24 & ప్రకటన 6" అనే దానితో *ట్రూత్ ఫర్ టుడే* (మే 1999) "ప్రకటన 4లో" నీవు ఈ పాఠాన్ని ఆంగ్ల సంచికలో చెక్ చేయవచ్చు.

"యేసు మన కానుకలవైపు చూచినప్పుడు," అది "యిప్పుడును వచ్చేయున్నది" అనే ప్రసంగాలు చేయవచ్చు. "లోకము యొక్క అవసరత" (యోహాను 12:21) "నేను పైకెత్తబడినప్పుడు"[50] "యేసును చూచుట," "ఈ లోకాధికారి" (యోహాను 12:31; మత్తయి 4:8, 9; 2 కొరింథీ. 4:4; ఎఫెసీ. 6:12) "ఎవరి మెప్పును నీవు కోరతావు?" (యోహాను 12:43).

## వివరణ

మన స్టడీ అరేంజ్‌మెంట్ సందర్భంగా ఈ పాఠము, ఆ తరువాత పాఠం పలు సవాళ్ళను మన యెదుట పెడుతున్నాయి. లేఖనం యొక్క పొందిక 40 భాగాలుగా విభాగించేలా చేస్తుంది: ఈ పద్ధతి ఈ పొందికలో తప్ప ప్రతి చోట పని చేసింది. మంచిగా విభజించే ఏ స్పాటూ లేదు. ఈ విధంగా, చదువవలసిన వాటిలో సూచింప బడినట్టే, ఈ స్టడీ మత్తయి 24తో ఆరంభమై, తరువాత పాఠంలో ముగింప బడుతుంది. గనుక నేను ఈ రెండు పాఠాలను రెండు భాగాల స్టడీగా భావిస్తున్నాను.

*దీనికి సంబంధించిన సవాలు:* బైబిలు క్లాసు పాఠాలు పొందికమీద ఉంచాలనేది ప్రాథమిక ఏర్పాటు. ఈ పాఠంలోను, తరువాత పాఠంలోను మత్తయి 24ను వివరముగా చదవడంవలన, రెండవ పాఠంలో వేరొక లేఖన భాగం ఏమీలేదు. గనుక, తరువాత పాఠం తరువాత ప్రసంగం వస్తుంది – అది గ్రీకు దేశస్తులు దేవుని వెదకే సంఘటనకు సంబంధించింది.

*వ్యత్యాసమైన సమస్య:* యోహాను 12:20–50లోని సంఘటనలు ఎప్పుడు జరిగాయో మనకు తెలియదు. ఆదివారమున విజయోత్సవంతో ప్రవేశించడానికిని, చివరి రాత్రి భోజనం శుక్రవారానికిని మధ్య యోహాను దాఖలు చేసిన సంఘటన యిది ఒక్కటే. గనుక దేవాలయంలోని క్రీస్తువారి కార్యాలు సరిగా ఎక్కడ పెట్టాలో మనకు తెలియదు. ఈ కథ సోమవారపు కార్యకలాపంగా అనేక పొందికలు పెడతాయి. నేను దీన్ని ఎక్కడ పెట్టానో అదే దానికి తగిన చోటని నాకు తోస్తుంది. (1) క్రీస్తు యేసు స్త్రీల ప్రాంగణంలో ఉన్నట్టయితే, ("విధవరాలి కాసుల" సందర్భంలో ఆయన ఉన్నట్టు) ఆయన ఉన్నచోటికి గ్రీసు దేశస్థులు వెళ్లియుండగలిగేవారే కారు. ఆయన వారి యొద్దకు వచ్చేలా మనవి చేసియుండే అవకాశముంది. (2) యేసును యూదులు ఎలా స్వీకరించారో చూపించే సంగ్రహమే యోహాను 12:37–50 – లేదా, మరీ ప్రత్యేకంగా చెప్పాలంటే – యుదా

మత నాయకులు ఆయనను ఎలా అంగీకరించలేదో అది తెలుపుతుంది. చివరిసారి క్రీస్తు దేవాలయాన్ని విడిచిపెట్టడానికి ఈ సంగ్రహము పూర్వ చరిత్రగా నిలుస్తుంది.

---

సూచనలు

[1]చివర యివ్వబడిన వివరణను చూడు. [2]స్త్రీల ప్రాంగణంలో దేవాలయపు కానుకలపెట్టె పెట్టబడినట్టుంది (మార్కు 12:41; లూకా 21:1). "క్రీస్తు జీవితం, 1"లో చూడు. [3]ఎక్కువ వివరాలకు "మన కానుకులపై యేసు చూచినప్పుడు" అనే పాఠమును చూడు. [4]B.S. Dean, "బైబిలు చరిత్ర యొక్క సంక్షిప్త వర్ణన" అనే పుస్తకమును చూడు. [5]యేసు పరిచర్యలోని ఆఖరి దినాలలో ఎక్కడ ఈ సంభవాలను పొందుపరచాలో తెలియదు కాని ఇక్కడ సరిపోతాయి. [6]వివరాలకు "గడియ వచ్చియున్నది" అనే ప్రసంగమును చూడు. [7]"అధికారులు" అని యోహాను 12:42లోని వారు సమాజమందిరపు అధికారులు కావచ్చు. ఈ సందర్భంలో వారు సన్‌హెడ్రిన్ సభ్యులై యుండవచ్చు. [8]స్వస్థత పొందిన గుడ్డివానిని సమాజమందిరమునకు వెలుపల ఉంచడం పై వ్యాఖ్యానాన్ని "క్రీస్తు జీవితం, 4"లో చూడు (యోహాను 9:22, 34). [9]మత్తయి 10:32, 33 పై వ్యాఖ్యానాన్ని మరియు పేతురు యిచ్చిన "మంచి ఒప్పుకోలు" పై సంక్షిప్త వివరణను "క్రీస్తు జీవితం, 3"లో చూడు. [10]యేసు ప్రజలలోనుండి దూరమై వారికి మరుగైయుండెనని యోహాను చెప్పినందున (యోహాను 12:37), యోహాను 12:23–36లో జరిగిన సంభాషణ తరువాత యేసు ఈ మాటలు పలుకలేదని అంటాం. క్రీస్తు పరిచర్యలోని ఆఖరి వారములో ఎప్పుడైన మాట్లాడి ఉండవచ్చునని అంటారు.

[11]"దేవునితో సమానము" అనే ప్రసంగమును "క్రీస్తు జీవితం, 2"లో చూడు. [12]యోహాను 8:12పై వ్యాఖ్యానాన్నీ, యోహాను 9ని గూర్చి "నేను గుడ్డివాడనై యుండి ఇప్పుడు చూచుచున్నాను" అనే ప్రసంగమునూ "క్రీస్తు జీవితం, 4"లో చూడు. [13]ఈలాటి ప్రతిపాదనయే యోహాను 3:17 చేయబడింది. ఆయన మొదట వచ్చింది రక్షించడానికి తీర్పు తీర్చడానికి కాదు; ఆయన రెండవ సారి ప్రత్యక్షమయ్యేది తీర్పు తీర్చుడానికి (మత్తయి 25:31, 32; అపొ. 17:31). [14]దీన్ని ప్రకటన 20:12తో పోల్చి చూడు. వివరాలకు "ప్రకటన, 10" (ట్రూత్ ఫర్ టుడే ( నవంబర్ 1999 ఆంగ్ల సంచికను): 24–25 చూడు. [15]యోహాను 2:11; 8:54 చదువు. [16]1 సమూ. 4:21, 22 చదువు. [17]"అర్పితములనే" పదం "Vow" అనే లాటిన్ పదమునుండి వచ్చింది. NIVలో "దేవునికి అర్పించిన కానుకలు" అని ఉంది. [18]క్రీ.శ.64 వరకు పని ముగింపు కాలేదు – దేవాలయం నాశనం చేయడానికి కేవలం ఆరు సంవత్సరాలకు ముందుగానే అది పూర్తి చేయబడింది. [19]దేవాలయమును గూర్చిన ఎక్కువ వివరాలకు "కార్యగ్రంథం, భాగం 1, 5"లో చూడు. "క్రీస్తు జీవితం, 1"లో హేరోదు దేవాలయాన్ని నిర్మించడాన్ని గూర్చి క్లుప్తంగా చెప్పబడింది. దేవాలయాన్ని గూర్చి కనుగొన్న ఎక్కువ వివరాలు యోసేపు యుద్ధాలు 5.5నుండి తీయబడినవే. [20]మత్తయి 22:7; 23:38 పై వివరాలకు ఈ పుస్తకములో చూడు. లూకా 13:35పై వివరాలకు "క్రీస్తు జీవితం, 4"లో చూడు. యేసు యెరూషలేము నాశనమును గూర్చి చెప్పుతూ ఆయన విలపించారు (లూకా 19:43, 44), అయితే ఆయన శిష్యులు ఆయన మాటలు ఆ రోజు విన్నారా లేదా అనేది అనిశ్చయం.

[21]యెరూషలేమును గూర్చి విలపించిన ప్రభువు యిలాటి ప్రతిపాదన చేశారు (లూకా 19:44). [22]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or a Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 619. [23]Robert Duncan Culver, *The Life of Christ* (Grand Rapids, Mich.: Baker House, 1976), 225-26. [24]పేతురు, యాకోబు, యోహాను మరియు అంద్రెయలను మార్కు ప్రత్యేకించి ప్రస్తావించారు (మార్కు 13:3). [25]KJVలో "లోకాంతం" అని ఉంది అయితే "యుగాంతము" అనే దానిని ఎక్కువ **తర్జుమదార్లు** అంగీకరిస్తారు. [26]ఈ పదం పత్రికలలో క్రీస్తు రెండవ రాకడను సూచించడానికి కన్పిస్తుంది (1 కొరింథీ. 15:23; 1 థెస్స. 2:19; 3:13; 4:15; యాకోబు 5:7, 8లను చూడు). [27]Will Ed Warren, Class Syllabus, *The Life of Christ: The Synoptic Gospels,* Harding University, 1991, 96. [28]తన రెండవ రాకడను గూర్చి ప్రభువు సూచించారు (మత్తయి 16:27; లూకా 12:40; 17:22–37లను చూడు). [29]వెయ్యేండ్ల పరిపాలనకు "ప్రకటన, 1"లో (ఆంగ్ల సంచికను) చూడు. [30]మత్తయి 24 క్రీ.శ. 70లో యెరూషలేము నాశనముతో పాటు ప్రభువు "రెండవ రాకడ" నెరవేర్చబడిందని నమ్మువారు ఉపయోగిస్తారు. ఇది వింతైన ప్రమాదకరమైన సిద్ధాంతం.

[31]A. T. Robertson, *A Harmony of the Gospels for Students of the Life of Christ* (New York: Harper & Row, 1950), 173. [32]అపోక్లాపిక్ భాషలకొరకు "ప్రకటన 1ని" చూడు. [33]ఈ లేఖనాలపై వివరణను ఈ పుస్తకములో చూడు. [34]తరువాత పాఠాన్ని చదువు. మత్తయి 24లోని ఆఖరి భాగం రెండవ రాకడను గూర్చి

తెలుపుతుందని తీర్పును గూర్చి తెలిపే అధ్యాయం (మత్తయి 25) రుజువు చేస్తుంది. [35]తదితర వ్యత్యాసాలను మత్తయి 24ను పఠించునప్పుడు చూద్దాం. [36]ఈ వాదనలోని ప్రమాద కరమైనదేమనగా, మత్తయి 24లోని తొలి భాగం యెరూషలేము నాశనమునకు బదులుగా రెండవ రాకడను గూర్చి చెప్పుతుందని వెయ్యేండ్ల సిద్ధాంతికులను చెప్పనివ్వడమే. [37]దాదాపుగా నలభై సంవత్సరాల తరువాత యెరూషలేము నాశనం జరిగింది – యేసు ఈ మాటలను పలికినప్పుడు ఉన్న కొందరు జీవిస్తుండగానే సంభవించింది. [38]R.T. France, *The Gospel According to Matthew,* Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 346. [39]Jack P. Lewis, *The Gospel According to Matthew, Part 2,* The Living Word Commentary Series, ed. Everett Ferguson (Abilene, Tex.: ACU Press, 1976), 129-30. [40]మత్తయి 24 పాఠమును Stafford North at the Eastside church of Christ, Midwest City, Oklahoma, 30 September 1997లో చేసిన ప్రసంగం నుండి తీయబడింది.

[41]మత్తయి 24:27 యేసు ఆయన రెండో రాకడను గూర్చి చెప్పినవాటికి మినహాయింపైయుంది. [42]ఆ "కష్టమైనవి" మత్తయి 24:27, 29–31లో చేర్చబడ్డాయి. [43]Josephus (*Wars* 2.12.4-5; *Antiquities* 20.5.1-2; 20. 8.6). [44]"పరలోకమునుండి గొప్ప సూచనలు, భీతిగొలిపేవి" అను వాటిని లూకా చేర్చాడు. [45]సంఘమునకు కలిగిన శ్రమలు గూర్చి అపొస్తలుల కార్య గ్రంథం మరియు క్రొత్త నిబంధన యితర రచనలు తెలుపుతాయి. [46]వారిలో కొందరు చంపబడుదురని ప్రభువు చెప్పియున్నందున (లూకా 21:16), "మీ తలవెంట్రుకలలో ఒకటైనను నశింపదు" (లూకా 21:18) అనే వాగ్దానానికి, మీరు చంపబడినా నశించరు అని అర్థం. పునరుత్థానంలో అంతిమ విజయాన్ని ప్రభువు వారికి వాగ్దానం చేసారు. [47]పౌలు అధిపతులు, రాజులు యెదుట నిలబడ్డాడని మనం ఎరుగుదుము (అపొ. 26); యితర అపొస్తులులు కూడా వారు ఏమి మాట్లాడవలనో దానిని పరిశుద్ధాత్మ తెలియజేస్తాడు అనే వాగ్దానం అపొస్తలులకు యివ్వబడింది, మనకు కాదు. దేవుని వాక్యం బోధించేకి ముందు చదవాలి. [48]ఈ ప్రవచనమును గూర్చిన నెరవేర్పును 2 పేతురు 2:1; 1 యోహాను 4:1లో చూడు. [49]"సమస్త సృష్టికి" అనేది రోమా సామ్రాజ్యములోని ప్రజలను సూచిస్తుందని పలువురు అంగీకరిస్తారు లూకా 2:1లోని "సర్వలోకమునకు" అనేది రోమా సామ్రాజ్యాన్ని సూచిస్తుంది. రోమా సామ్రాజ్యములోని వారి అందరికి సువార్త వినే అవకాశం లభించిందని రుజువగుతుంది (రోమా 1:5, 8; కొలస్సీ. 1:5, 6; 1 థెస్స. 1:8). [50]Batsell Barrett Baxter, "And I, If I Be Lifted Up ... ," *If I Be Lifted Up* (Nashville: Gospel Advocate Co., 1956), 1-8.

## చార్టు 1:మత్తయి 24లో తారతమ్యాలు

| **యెరూషలేము నాశనము (మత్తయి 24:4–35)** | **క్రీస్తు రెండవ రాకడ (మత్తయి 24:36–41)** |
|---|---|
| కలవరం కలిగించే కాలాలు ముందుగా వస్తాయి (5–12 వచనాలు). | మామూలు దినాలు ముందుగా వస్తాయి (నోవహు దినములవలె: 37–39 వచనాలు). |
| (యెరూషలేమును సైనికులు ఆక్రమించడం అనే ప్రత్యేకమైన సూచన ముందుగా కలుగుతుంది, క్రైస్తవులు దానిని ఎరుగుదురు [15 వ.; లూకా 21:20]). | హెచ్చరించే ఏ సూచన ఉండదు ఎవరును ఆ సమయాన్ని ఎరుగలేరు (36 వ.); అది ఆకస్మికము (39 వ.). అది తెలియకుండా వచ్చు దొంగవలె ఉంటుంది (43వ.). |
| ఈ సంఘటన నుండి ప్రజలు పారి పోగలరు (16 వ.). | దీని నుండి ప్రజలు పారిపోలేరు (ఒకరు కొనిపోబడతారు, ఒకరు విడువ బడతారు; 40, 41 వచనాలు). |